జలపుష్ప విలాసం

ఆశాజనకంగా చేపల వేట
ఆనందం వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
మంచి గిరాకీతో కష్టానికి తగ్గ ఫలం

చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులకు శ్రమకు తగ్గ ఫలితం లభిస్తోంది. కొమ్ముకోనాం, టేకు, సొర, కండవాలు, కానాగడతలు, పారలు, మెత్తని పారలు, గులివిందలు, కళ్ల ఒడుగులు, బడే మట్టలు, సైమన్ల వంటి చేపలు విరివిగా లభిస్తున్నాయి. పది నుంచి పన్నెండు రోజులు, నాలుగు నుంచి ఆరు రోజులు, మూడు నుంచి నాలుగు రోజుల వేట పద్ధతిన మూడు రకాలుగా వేట సాగిస్తున్నారు. అన్ని ఖర్చులు పోను బాగానే మిగులుతోందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



ఫిషింగ్ హార్బర్‌లో వేటకు వెళ్లి తెచ్చిన చేపలు



వేటకు వెళ్తున్న బోట్లు



బోటు రాకతో హడావిడిగా హార్బర్

మహారాణిపేట: ఇటీవల వేటకు వెళ్లిన బోట్లకు చేపలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఇవి మత్స్యకారుల మోముల్లో ఆనందం నింపుతున్నాయి. సాధారణంగా మరబోట్లు 10–12 రోజులు, మరికొన్ని బోట్లు వారం రోజులు వేట సాగిస్తాయి. వారం లోపు వేట సాగించిన బోట్లకు 2–3 టన్నుల చేపలు లభ్యమవుతున్నాయి. వీరి వలలకు మార్కెట్లో మంచి ధర పలికే చేపలు కూడా చిక్కుతున్నాయి. వీటిలో కండవాలు, కానాగడతలు, పారలు, మెత్తని పారలు, గులివిందలు, కళ్ల ఒడుగులు, బడే మట్టలు, సైమన్లు వంటివి ఉన్నాయి. కొమ్ముకోనాం, టేకు, సొర చేపలు కూడా ఎక్కువగానే దొరుకుతున్నాయి.

ఇప్పుడైతే మంచి ధర..

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి 749 మరబోట్లు, 1210 వరకు మోటారు బోట్లు సముద్రంలో వేట సాగిస్తుంటాయి. జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం, 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. విశాఖ తూర్పు తీరంలో వేట మీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 12,000 కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడ్డాయి.

వలురకాల రొయ్యలు..

ప్రస్తుతం రొయ్యల లభ్యత తక్కువగా ఉంది. వారంలోపు వేట సాగిస్తున్న కొన్ని బోట్లకు టన్ను వరకు పడుతున్నాయి. వీటిలో చిన్న రొయ్యలతో పాటు బ్రౌన్, పింక్, వైట్, టైగర్ రొయ్యలు కూడా ఉంటున్నాయి. కానీ వీటి ధర తక్కువగా ఉండడం వల్ల గిట్టుబాటు కావడం లేదని బోటు యజమానులు చెబుతున్నారు.

మూడు పద్ధతుల్లో వేట

మత్స్యకారులు మూడు పద్ధతుల్లో వేట సాగిస్తుంటారు. 10 నుంచి 12 రోజుల పాటు వేట కోసం సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. పది టన్నుల ఐస్ రూ.17 వేలు, 3 వేల లీటర్ల ఆయిల్ కోసం రూ.3 లక్షలు, బోటు సిబ్బందికి అవసరమైన ఆహార పదార్థాల కోసం రూ.20 వేలు సరకులు, గ్యాస్ స్టౌ, స్పేర్ పార్ట్స్ తదితర వాటికి ఖర్చు అవుతుంది. అదే 4 నుంచి 6 రోజుల వేట కోసం ఇందులో సగం ఖర్చు అవుతుంది. మూడు రోజుల వేటకు ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. అలాగే చిన్న చిన్న సంప్రదాయ పడవలతో రోజువారీ వేట కొనసాగుతుంది.

మంచి గిరాకీ ఉంది



ప్రస్తుతం మత్స్య సంపద సమృద్ధిగా లభిస్తోంది. రొయ్యల కన్నా చేపలు బాగా దొరుకుతున్నాయి. కొమ్ముకోనాం, టేకు, సొర చేపలు ఎక్కువగా వలలకు చిక్కుతున్నాయి. సముద్రంలో వేటాడి తెచ్చిన వెంటనే చేపలు హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి.

–సిద్దిపల్లి సూర్యనారాయణ, చేపల వ్యాపారి

వేట బాగుంది



రెండు నెలల విరామం తర్వాత వేట ఆశాజనకంగా సాగుతోంది. మత్స్య సంపద బాగానే దొరుకుతోంది. వలలకు చేపలు చిక్కుతున్నాయి. ప్రస్తుతం మూడు రోజులు, వారం రోజుల వేట బాగుంది. చేపలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.

– ఎస్.సూర్యనారాయణ, బోటు డ్రైవర్

క్లుప్తంగా

పెండింగ్ బిల్లుల విడుదలకు తీర్మానం

దాబాగార్డెన్స్: గ్రాంటు, జీవీఎంసీ సాధారణ పద్దులో ఉన్న పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం తీర్మానించింది. అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం జీవీఎంసీ ప్రాంగణంలో గల అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. లయబిలిటీ పీరియడ్ దాటి పెండింగ్‌లో ఉన్న ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ, ఏఎస్‌డీ కూడా వెంటనే చెల్లింపులు జరపాలని, మరీ ముఖ్యంగా కాంట్రాక్టర్ల అంతర్గత సమస్యలు పరిష్కరించేందుకు కమిషనర్ సమక్షంలో సంబంధిత అధికారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

కేజీహెచ్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మహారాణిపేట : గత కొద్ది రోజుల నుంచి సమ్మె చేస్తున్న వైద్య విద్యార్థులు కేజీహెచ్‌లో ఓపీ, వార్డులకు హాజరు కాకపోవడంతో సూపరింటెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఓపీ, వార్డుల్లో అత్యవసర సేవలు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. మంగళవారం 1612 మందికి ఓపీ, 8 మంది రోగుల అడ్మిషన్లు, క్యాజువాలిటీలో 43 మంది అత్యవసర రోగులకు చికిత్స నిర్వహించామని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. అలాగే 4 మేజర్ సర్జరీలు, 3 మైనర్ సర్జరీలు జరిగాయన్నారు. రోగులకు ఎలాంటి అంతరాయం కలగకుండా పలు చర్యలు చేపట్టామని, ఓపీ కోసం పలువురి సేవలను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమునిపట్నం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ వద్దనున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎ.వి.వర్మరాజు పూల మాల వేసి నివాళులు అర్పించారు. పీసీసీ జనరల్ సెక్రటరీ గాదం మహేష్, నాయకులు పడాల రమణ, పొట్టి రజనీకాంత్, కాట సన్యాసిరావు పాల్గొన్నారు.

పద్యపఠన, వ్యాస రచన పోటీలకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 29న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ ఆధ్వర్యంలో తెలుగుభాష ఆవశ్యకతపై విద్యార్థులకు పద్య పఠన, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు స్కూల్ వద్ద ఈ పోటీలు నిర్వహిస్తారు. వివరాలకు 80746 33106, 70134 11907 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం



వంశీకి ఆహ్వానం పలుకుతున్న మన్యాల శ్రీనివాస్, ఎస్‌వీవైసీసీ బాయ్స్

దాబాగార్డెన్స్: ఈ నెల 26న జీవీఎంసీ 29వ వార్డు వేంకటేశ్వరనగర్ ఎస్‌వీవైసీసీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు జనసేన పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ నేతృత్వంలో ఆహ్వానం పలికారు. వంశీకృష్ణ స్పందిస్తూ వేడుకల్లో తప్పకుండా పాల్గొంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వీవైసీసీ బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

మహారాణిపేట: కోల్‌కతాలో ఇటీవల వైద్యురాలిపై జరిగిన విషాద ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనలో భాగంగా మంగళవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద మొదలైన ప్రదర్శన కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ వైద్య విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ కలెక్టరేట్‌కు చేరుకుని వైద్య విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులు ఆర్. ఊహ, కార్యదర్శి రాజా వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన..

దాబాగార్డెన్స్: కోల్‌కతాలో యువ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దురాగతాలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్య రంగంలో పని చేసే వారి భద్రతకు సమగ్ర చట్టాలు రూపొందించాలన్నారు. ఎల్ఐసీ విశాఖ సిటీ బ్రాంచ్ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన..

విశాఖ లీగల్ : కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి పట్ల విశాఖ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాద సంఘంతో పాటు పలు న్యాయవాద సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. మంగళవారం న్యాయవాదులందరూ జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద తమ నిరసన ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జూనియర్ వైద్యులకు తమ మద్దతు ప్రకటించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవర సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత దారుణమైన ఘటనగా దీనిని అభివర్ణించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ నిరసనను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర బార్ కౌన్సిల్‌కు తెలియజేస్తామన్నారు. అలాగే నిందితుల తరఫున దేశంలో న్యాయవాదులందరూ కోర్టుకు హాజరు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్‌కు లేఖ రాస్తామన్నారు. కార్యక్రమంలో అఖిలభారత న్యాయవాదుల సంఘం, భారత న్యాయవాదుల సంఘం, మహిళా న్యాయవాదుల సమాఖ్య, ఫోరం ఫర్ జస్టిస్, పలు సేవా సంఘాలు పాల్గొన్నాయి.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



విశేష పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం 16వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మహోన్నతమైనది శ్రీవైఖానస ఆగమం



రామకృష్ణాచార్యులను సత్కరిస్తున్న ఆధ్యాత్మిక రంగ ప్రముఖులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర శ్రీవైఖానస మండలి, శ్రీవైఖానస యూత్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్, మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవిఖనస మహాముని జయంతి నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులరెడ్డి సహకారంతో మహాముని జయంతి మంగళధ్వని వేద మంత్రాలతో సాంప్రదాయ రీతిన జరిపారు. ముందుగా ఆలయంలో వేంచేసిన శ్రీవిఖనస మహాముని విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిఖనస మహాముని ఉత్సవ మూర్తిని పల్లకిపై ఉంచి ఆలయం చుట్టూ తిరువీధి మహోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైఖానస మండలి గౌరవ అధ్యక్షుడు ఆర్. సింరాచార్య భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఆగమాలన్నిటిలోకెల్లా శ్రీవైఖానస ఆగమం మహోన్నతమైనదని, పరమాత్మునికి ఎంతో ప్రీతికరమైనదని తెలిపారు. ఈ ఆగమాన్ని అనుసరిస్తున్న వారందరినీ ధన్యులుగా పేర్కొన్నారు. విఖనస మహాముని జయంతి ఉత్సవం నిర్వహించిన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికంగా విశేష సేవలందిస్తున్న ఎస్. రామకృష్ణాచార్యులు, పి. వెంకట లక్ష్మీనరసమ్మ, శాస్త్రీయ సంగీత వైభవానికి కృషి చేస్తున్న వెంకట్రావుకు విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బృందావనం దేశికాచార్యుడు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, గీతా ప్రచార సమితి ఉపాధ్యక్షుడు జగన్మోహనరావు, పి. శ్రీనివాస్ చక్రవర్తి, ఎం. రామకృష్ణాచార్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. సంగీత జనకులం శిష్యులు ఆలపించిన వాగ్గేయకార సంకీర్తనలు అలరించాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ, మలేరియా విభాగం సిబ్బంది

దాబాగార్డెన్స్: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికున్ గునియా తదితర రుగ్మతలకు కారణమైన దోమల వృద్ధిని అరికట్టేందుకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ చేపట్టినట్లు జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి పేర్కొన్నారు. దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి పాత జైల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ మాట్లాడుతూ ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడ వాపు తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడతున్నామని, ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు, సీసాలు, ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటితొట్టే, పూల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. దోమల నియంత్రణకు కాలువలు శుభ్రం చేయడం, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి కార్యక్రమాలు నిత్యం జీవీఎంసీ మలేరియా విభాగం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎం. తులసి, జీవీఎంసీ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వృక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న కేజీహెచ్ ఏడీ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : కేజీహెచ్ మినిస్టీరియల్, నర్సింగ్ ఉద్యోగులు, క్లైమేట్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, మేనేజర్ పి.ఎం.జవహర్‌లాల్, క్లైమేట్ ఫ్రంట్ సభ్యులు శరత్ సునీల్, సౌమిత, కార్తీక, మోహన్, ఈశ్వర్, ఉదయ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లికి పసుపు కుంకుమలు

తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామ దేవత బంగారమ్మ తల్లి వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వాసులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. గులాబీ, బంతి, చామంతి పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద నేలవేషాలు, బాణసంచా, పులివేషాలతో సందడి కనిపించింది.

మొదలైన ఓటర్ల జాబితాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఇంటింటికీ ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమం మళ్లీ ప్రారంభమైందని ఇన్‌చార్జి ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవెల్ అధికారులు, సిబ్బంది ఈ పరిశీలన నిర్వహిస్తారని, డిసెంబర్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మిగిలిపోయిన కొత్త ఓటర్లను జాబితాల్లో చేరుస్తారని, మరణించిన వారి పేర్లు తొలగించడం వంటి మార్పులు చేర్పులతో పాటు ఏమైనా ఇబ్బందులుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఏ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల ఓట్లు అక్కడే ఉండే విధంగా నమోదు చేస్తామని, దూరప్రాంతాలకు వెళ్లే ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. జాబితాల పరిశీలనలో తప్పులు జరగకుండా జాగ్రత్తలను తీసుకుంటున్నామని, రాజకీయ నాయకులు కూడా సహకరించాలని కోరారు. నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, గంటా నూకరాజు, భాగం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లలో నీటి సదుపాయం కల్పించాలని వినతి



టాయ్‌లెట్లలో నీరు కరువు

దాబాగార్డెన్స్: ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూత వేటు దూరంలో గల సెంట్రల్ పార్క్‌లో మౌలిక సదుపాయాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. పార్క్ చూడముచ్చటగా ఉన్నా సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. పార్క్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లలో నీరు సక్రమంగా ఉండడం లేదు. ఓ సందర్శకుడు సోమవారం సెంట్రల్ పార్క్‌ను సందర్శించాడు. అతనికి అర్జెంట్‌గా టాయ్‌లెట్ వచ్చింది. పార్క్‌లో ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లకు వెళ్లాడు. అక్కడ నీరు లేక అవస్థలు పడుతూ సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆహ్లాదకర వాతావరణంలో గల పార్క్‌కి మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.

చెట్ల కొమ్మల తరలింపులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డులో ఎన్జీజీవోస్ కాలనీ, 80 అడుగుల రోడ్‌లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించిన అధికారులు ఐదు రోజులు గడుస్తున్నా వాటిని తరలించలేదు. దీంతో ఇళ్ల ముందు చెట్ల కొమ్మలు ఎండిపోయి, ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. చెట్ల కొమ్మలు తరలించాలని జీవీఎంసీ పారిశుధ్య విభాగానికి ఫిర్యాదులు వస్తున్నాయి. చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే విద్యుత్ విభాగం సిబ్బందే తరలించేవారు. ప్రస్తుతం తరలింపు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో పారిశుధ్య సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

‘రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరణ’

అగనంపూడి: మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ఈనెల 25న నిర్వహించనున్న రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు కోరారు. పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. యన మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ కార్తీక్ మాట్లాడుతూ పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు నిర్వహించనున్న రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అగనంపూడి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, జేసీఐ వైజాగ్ స్టీల్ ఉపాధ్యక్షుడు ఎస్.రవికుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి సత్యసాయి భజన మండలి కోఆర్డినేటర్ బి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.